క్లుప్తంగా

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



కోమర్తిలో మాట్లాడుతున్న రమణమ్మ

నరసన్నపేట: కిశోర బాలికలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ అల్లు రమణమ్మ అన్నారు. ప్రపంచ మెన్‌స్ట్రువల్ హైజనిక్ డే సందర్భంగా మండలం కోమర్తి, లుకలాం గ్రామాల్లో 14–18 ఏళ్ల వయస్సు ఉన్న బాలికలకు సోమవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. రమణమ్మ మాట్లాడుతూ రుతుక్రమం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఎటువంటి ఆహారం తీసుకోవాలి, వ్యక్తిగత ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఆయా గ్రామాలకు చెందిన బాలికలు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలు

సరుబుజ్జిలి: గ్రామాల్లో కవ్వింపు చర్యలకు పాల్పడి శాంతి భద్రతలకు విఘాతం కలిగించినవారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని స్థానిక ఎస్సై బి.నిహార్ తెలిపారు. మండలంలోని చిగురువలస గ్రామంలో సోమవారం కార్డెన్ చర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో కొత్త వ్యక్తులు, అక్రమ మద్యం నిల్వలపై ఆరాతీశారు. సరైన ధ్రువపత్రాలు లేని దిచక్ర వాహనాలను సీజ్ చేశారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేస్తున్న ఏడీఏ, ఏఓ

కొత్తూరు: ప్రభుత్వం రాయితీపై ఇస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని కొత్తూరు వ్యవసాయ సబ్ డివిజన్ ఉప సంచాలకులు రాజగోపాలరావు రైతులకు సూచించారు. మండలంలోని ఒండ్రుజోలో సోమవారం పచ్చిరొట్ట ఎరువుల విత్తనాను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ రాజగోపాలరావు, ఏఓ ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలను పొలంలో వేయడం వల్ల భూసారం పెరుగుతుందన్నారు. మండలానికి జీలుగు, పిల్లి పెసర, కట్టిజనుము విత్తనాలు 38 క్వింటాళ్లు వచ్చాయన్నారు. ఈ విత్తనాలు కొత్తూరు, కడుము, లబ్బ, గొట్టిపల్లి, ఒండ్రుజోల, సిరుసువాడ రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటు ఉన్నాయన్నారు. అవసరమైన రైతులు ఆయా ఆర్బీకేల వద్దకు వెళ్లి కొనుగోలు చేయాలని కోరారు. వ్యవసాయ సహాయకులు సౌజన్య, పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రజా సేవలో భాగస్తులు కావాలి



ఏసీని ప్రారంభిస్తున్న సురేష్

హిరమండలం: ప్రతిఒక్కరూ సమాజ సేవలో భాగస్తులు కావాలని ప్రేమసాయి వృద్ధాశ్రమం గౌరవాధ్యక్షుడు ఏపీ సురేష్ పిలుపునిచ్చారు. ఆశ్రమంలో నూతనంగా ఏర్పాటుచేసిన ఎయిర్ కండీషనర్‌ను సోమవారం ప్రారంభించారు. వృద్ధుల సౌకర్యార్థం పదవీ విరమణ చేసిన ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ సుధాకర్ తన తండ్రి జ్ఞాపకార్థం ఎయిర్ కూలర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆశ్రమంలో 25 మంది వరకు ఆశ్రయం పొందేందుకు అవకాశముందని.. ప్రస్తుతం 12 మంది ఉన్నారన్నారు. అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కన్వీనర్ చంటి మాస్టారు, సాయిబాబా, గోవిందశర్మ, జయరాం, నరసింహమూర్తి, చంద్రభూషణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జాతర

పొందూరు: మండలంలోని తండ్యాం పంచాయతీ పరిధిలోని మన్నెపేట కొండపై గల వేంకటేశ్వరస్వామి 33వ జాతర మహోత్సవాలు సోమవారంతో ముగిశాయి. అలివేలిమంగమ్మ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. అలివేలు మంగమ్మ, పద్మావతి అమ్మవార్లకు కుంకుమ పూజలను రుత్వికులు గన్నవరపు రాంబాబు ఆధ్వర్యంలో చేపట్టారు. లలితా స్తోత్రనామ పారాయణం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో మలకాం, తండ్యాం, బొట్లపేట, శ్రీరామనగర్ కాలనీ, పొందూరు తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

• పేరుకుపోయిన గుర్రపు డెక్క



సరుబుజ్జిలి మండలం యరగాం- పురుషోత్తపురం ఓపెన్‌హెడ్ చానల్‌తోపాటు, వంశధార కుడి ప్రధాన కాలువ, పిల్ల కాలువల్లో గుర్రపు డెక్క విస్తారంగా పేరుకుపోయింది. ఏటా సాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదు. సాగునీరు శివారు ప్రాంతాలకు అందడం లేదు. మరికొద్ది రోజుల్లో ఖరీఫ్ ప్రారంభంకానుందని అధికారులు స్పందించి గుర్రపు డెక్క తొలగించాలని రైతులు కోరుతున్నారు. ఇదే విషయమై వంశధార జేఈ స్వాతి వద్ద ప్రస్తావించగా గుర్రపుడెక్క తొలగింపు కోసం అన్ని చర్యలూ తీసుకుంటామని వెల్లడించారు.

\- సరుబుజ్జిలి

• 90 మందికి కంటి పరీక్షలు



పాతపట్నం మండలంలోని తెంబూరు గ్రామంలో సత్యసాయి భజన మండలి, శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సత్యసాయి మందిరంలో శంకర్ ఫౌండేషన్ ఆప్తాలమిక్ అంజలి 90 మంది రోగులకు కంటి పరీక్షలు చేశారు. 28 మందికి కంటి శస్త్రచికిత్సకు ఎంపి చేశారు. వారిని విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్‌కు తీసుకువెళ్తామని కో ఆర్డినేటర్ రామారావు తెలిపారు. భజన మండలి పరిశీలకుడు బి.చంద్రమౌళి, కన్వీనర్ ఎ.కామేశ్వరరావు పాల్గొన్నారు.

\- పాతపట్నం

• 108 సేవలపై ఆరా



బూర్జ మండలంలో 108 వాహన సిబ్బంది మరింత బాధ్యతగా విధులు నిర్వహించాలని 108 వాహన జిల్లా మేనేజర్ బొమ్మాళి హరిప్రసాద్ సూచించారు. సోమవారం బూర్జ మండలం 108 వాహనాన్ని కొల్లివలసలో పరిశీలించారు. వాహనంలో ఉన్న పరికరాల, సిబ్బంది పనితీరు, సిబ్బంది హాజరు, మందుల నిల్వలు, రికార్డుల నిర్వహణను తనిఖీ చేపట్టారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈఎంటీ కె.రమణ, పైలెట్ సి.హెచ్.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

\- బూర్జ

ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ బోధన



ఆమదాలవలస రూరల్: లొద్దలపేటలో అడ్మిషన్ పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు



సారవకోట: చీడిపూడిలో అడ్మిషన్ పత్రం అందజేస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

ఆమదాలవలస రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు డిజిటల్ బోర్డులపై ఉత్తమ బోధనల వల్ల ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నట్లు తాడివలస ఉన్నత పాఠశాల హెచ్ఎం బి.కంటయ్య అన్నారు. మండలంలో లొద్దలపేట, బెలమాం గ్రామాల్లో ఐదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులను సోమవారం కలిసి ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లు పొందారని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని, అన్ని సౌకర్యాలు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా 12 మంది విద్యార్థులను పొందూరు మండలం తాడివలస ఉన్నత పాఠశాల్లో తల్లిదండ్రులు చేర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పి.రాంబాబు, ఎల్.గుణశేఖర్, సి.హెచ్.వేణుగోపాల్, ఎస్.తేజేశ్వరరావు, పి.హరిప్రసన్న పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి

సారవకోట: విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరుతూ సోమవారం మండలంలోని చీడిపూడి గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ స్థాయిలో అన్ని వసతులు కల్పిస్తున్నామని నాణ్యమైన ఉచిత విద్యతోపాటు మధ్యాహ్న భోజనం, పాఠ్య, నోట్ పుస్తకాలు, ఇతర వసతులు కల్పిస్తున్నామని ఎంఈఓలు ఎం వెంకటరమణ, కె భూలక్ష్మి కోరారు. చీడిపూడి పాఠశాల హెచ్ఎం పి.శ్రీనివాసరావు, లక్ష్మి పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణానికి సహకరించండి



మాట్లాడుతున్న డీఎస్పీ బాలచంద్రారెడ్డి

• డీఎస్పీ బాలచంద్రారెడ్డి

పోలాకి: జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు నేపథ్యంలో గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి స్థానిక పెద్దలుగా సహకరించాలని డీఎస్పీ బాలచంద్రారెడ్డి అన్నారు. సోమవారం పోలాకి పోలీస్ స్టేషన్‌లో అన్ని పార్టీల రాజకీయ నాయకులతో సమావేశమయ్యారు. ఎటువంటి వివాదాలు చోటుచేసుకున్నా చట్టపరంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇప్పటికే గ్రామాల్లో వివాదాలకు కారణమయ్యే వారిపై ప్రత్యేక నిఘా పెట్టామని, అలాంటివారు గొడవల్లో పాల్గొన్నారని తెలిస్తే రౌడీషీట్ తెరుస్తామన్నారు. పోలింగ్ రోజు ఘర్షణలు జరిగిన గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టామని, కార్డెన్ సెర్చ్ చేపట్టి తనిఖీలు చేపడుతున్నామని తెలిపారు. క్షేత్రస్థాయిలో రాజకీయాలపై అవగాహన కలిగిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్‌లు, ఇతర క్రియాశీల వ్యక్తులు ప్రజల్లో చైతన్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ ప్రసాద్, ఎస్ఐ సత్యనారాయణ, మండల పరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు, వైఎస్సార్‌సీపీ, టీడీపీ మండల అధ్యక్షులు కణితి కృష్ణారావు, ఎం.వి.ఎ.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పేర్లు నమోదు చేసుకోవాలి

ఎల్.ఎన్.పేట: భూసారం పెంచేందుకు వేసుకునే పచ్చిరొట్ట ఎరువుల్లో ప్రధానంగా చెప్పుకునే కట్టిజనుము, జీలుగ విత్తనాల కోసం రైతులు తమ పేర్లు నమోదు చేస్తున్నట్లు వ్యవసాయ అధికారి పైడి లతశ్రీ తెలిపారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ శాఖ సహాయకులు పేర్లు నమోదు చేస్తున్నారని సోమవారం తెలిపారు. కట్టిజనుమ, జీలుగ విత్తనాలు 50 శాతం రాయితీపై విక్రయిస్తున్నట్లు తెలిపారు. పేర్లు నమోదు చేసుకున్న రైతులు వారికి అవసరమైన విత్తనాల కోసం నగదు చెల్లిస్తే విత్తనాలు అందజేస్తామన్నారు. జీలుగు, కట్టిజనుము 10 కిలోలు ప్యాకెట్ రాయితీ పోను ధర రూ.440 ఉందన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందు తొలకరి వర్షాలు కురిసిన వెంటనే పదును ప్రకారం విత్తనాలు వేసుకోవాలన్నారు. వరి వెదలు వేసే రైతులు కూడా పచ్చిరొట్ట విత్తనాలు వేసుకుని 30 నుంచి 40 రోజుల లేత మొక్కగా ఉన్నప్పుడు దుక్కి చేసుకోవాలని సూచించారు. ఇలా చేయటం వల్ల భూసారం పెరుగుతుందన్నారు.

ఎమ్మార్సీకి చేరిన పాఠ్య పుస్తకాలు



సారవకోట: రానున్న విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా అందించేందుకు పాఠ్య పుస్తకాలు స్థానిక ఎమ్మార్సీకి సోమవారం చేరాయి. ఇప్పటికే 16 వేలకు పైగా నోట్ పుస్తకాలు చేరగా.. ప్రస్తుతం 6,862 వివిధ తరగతులకు చెందిన పాఠ్య పుస్తకాలు చేరినట్లు ఎంఈఓ ఎం.వి.రమణ తెలిపారు. వీటిని పాఠశాలలు పునఃప్రారంభమయ్యే సమయానికి విద్యార్థులకు అందజేయనున్నట్లు తెలిపారు.

విస్తృత తనిఖీలు



కొండరాగోలులో తనిఖీలు చేపడుతున్న పోలీసులు

హిరమండలం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో హిరమండలం పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎస్ఐ జి.నారాయణస్వామి ఆధ్వర్యంలో సిబ్బంది సోమవారం కొండరాగోలులో తనిఖీలు చేపట్టారు. ఎటువంటి పత్రాలు లేని రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే వెంటనే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. కౌంటింగ్ రోజు గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి పెట్టండి



మండల ఇంజినీర్‌ను ప్రశ్నిస్తున్న సభ్యులు

పోలాకి: గ్రామపంచాతీల్లో పారిశుధ్యం నిర్వహణపై చర్యలు తీసుకోవాలని, సచివాలయాలకు వెళితే సిబ్బంది అందుబాటులో ఉండటంలేదని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ముద్దాడ దమయంతి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రభుత్వ పథకాల అమలుపై చర్చలేకుండా పరిపాలనలో ప్రాధాన్యత అంశాలపై చర్చ నిర్వహించారు.

వ్యవసాయ, విద్య, వైద్యం, ఉపాధి, మహిళా, శిశు సంక్షేమం తదితర శాఖలపై సమీక్ష జరిగింది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటి నుంచి సచివాలయాల్లో సిబ్బంది అందుబాటులో ఉండటం లేదని సర్పంచ్‌లు కణితి సత్తిబాబు, గొల్లంగి అసిరితాత, మజ్జి రమణమ్మ తదితరులు ఆరోపించారు. మండల ఇంజినీర్ కీర్తన పనితీరుపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీడీఓ, ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేయాలని కోరారు. మండల పరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు, వైస్ ఎంపీపీలు కలగదండు తాతారావు, కోట అప్పారావు, ఎంపీడీఓ ఉషశ్రీ పాల్గొన్నారు.



సచివాలయ సిబ్బందిపై ఫిర్యాదు చేస్తున్న ఉర్లాం సర్పంచ్ సత్తిబాబు

కోర్టు ఆదేశాలతో ఆక్రమణల తొలగింపు



పూడికను తొలగిస్తున్న కార్మికులు

కొత్తూరు: మండలంలోని మదనాపురం పంచాయతీ పరిధి వెంకటాపురంలో ప్రభుత్వానికి చెందిన బావిని ఉపయోగంలోకి తీసుకురావాలని ఎంపీడీఓ, తహసీల్దార్‌తోపాటు పలువురు అధికారులకు హైకోర్టు ఆదేశించింది. వెంకటాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి బావిని, స్థలాన్ని ఆక్రమించారు. బావి ఆక్రమణను తొలగించాలని వెంకటాపురం గ్రామానికి చెందిన జి.త్రినాథరావు హైకోర్టులో కేసు వేశారు.

కేసును విచారణ చేపట్టిన హైకోర్టు బావి ఆక్రమణను తొలగించాలని అధికారులను ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు ఆక్రమణలు తొలగించి బావిలో ఉన్న పూడికలను సోమవారం తొలగించారు.

ప్రత్యేక అవసరాల చిన్నారుల గుర్తింపు



సరుబుజ్జిలి: సర్వే చేస్తున్న బృందం సభ్యులు



పాతపట్నం: ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తిస్తున్న ఐఆర్టీలు

సరుబుజ్జిలి: దివ్యాంగులైన పిల్లలకు ఉత్తమ సేవలు కల్పించడం జరుగుతుందని ఎంఈఓలు కె.శ్రీనివాసరావు, బాలరాజు తెలిపారు. మండలంలోని రొట్టవలస గ్రామాల్లో దివ్యాంగులైన పిల్లల కోసం సోమవారం సర్వే నిర్వహించారు. ఈ సర్వే ద్వారా పిల్లలను గుర్తించి వారికి ఫిజియోథెరపీ, హోమ్‌బేస్డ్ ఎడ్యుకేషన్ అందించడం జరుగుతుందన్నారు. ఈ సర్వేలో వెల్ఫేర్ అసిస్టెంట్ గొంటి అమ్మినాయుడు, ఐఈడీ ఉపాధ్యాయిరాలు అలేఖ్య పాల్గొన్నారు.

పాతపట్నం: సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా ప్రత్యేక అవసరాల పిల్లలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని ఎంఈఓ బొయిన శ్రీధర్ అన్నారు. మండలంలోని పాతపట్నం, తెంబూరు గ్రామాల్లో ప్రత్యేక అవసరాల విద్యను అందించాల్సిన బాలబాలికల గుర్తింపు సర్వేను సోమవారం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు 21 మంది పిల్లలను గుర్తించామన్నారు. జూన్ 9 వరకు ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. మండల ప్రత్యేక అవసరాల విద్య ఉపాధ్యాయులు సుధారాణి, ఇన్నా పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



ఆనందరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంపీపీ కర్నేన దీప



నిత్యావసర వస్తువులు అందజేస్తున్న శ్రీకాశీవిశ్వేశ్వర భజన భక్త బృందం సభ్యులు



ఆర్థిక సహాయం అందజేస్తున్న నూక సన్యాసిరావు

బూర్జ: మండలంలో గల లక్కుపురం గ్రామంలో సోమవారం వేకువ జామున అగ్ని ప్రమాదం సంభవించి రేగాన ఆనందరావుకు చెందిన పూరిల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సర్వం కోల్పోయిన ఇంటి యజమానిని ఎంపీపీ కర్నేన దీప పరామర్శించారు. అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. పెద్ద ఆర్చ్ సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేల చెక్కును అందించారు. అన్నంపేట గ్రామానికి చెందిన శ్రీకాశీవిశ్వేశ్వర భజన భక్త బృందంలోని పలువురు సభ్యులు ముందుకు వచ్చి నిత్యావసర వస్తువులు, దుస్తులు, రూ.6 వేల నగదు అందజేశారు.

• విద్యార్థులకు అవగాహన



మండల పరిధిలోని తండేవలస గ్రామంలో ఉన్న రైతు భరోసా కేంద్రం పనితీరుపై నైరా వ్యవసాయశాఖ విద్యార్థులకు ఒక్కరోజు అవగాహన కార్యక్రమం సోమవారం జరిగింది. రైతు భరోసా కేంద్రంలో సిబ్బంది నిర్వహిస్తున్న విధులు, విధానాలు, రైతులకు అందజేసే సేవలు, స్కీములుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ చిన్నంనాయుడు, మండల వ్యవసాయాధికారి ఉషకుమారి పాల్గొన్నారు.

\- శ్రీకాకుళం రూరల్

ఆదర్శనీయుడు జవహర్ లాల్ నెహ్రూ

శ్రీకాకుళం అర్బన్: భారతదేశ ప్రధానమంత్రిగా వ్యవసాయం, పారిశ్రామిక ప్రగతికి కృషి చేసిన ఆదర్శనీయుడు దివంగత పండిట్ జవహర్ లాల్ నెహ్రూ అని డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు అన్నారు. నెహ్రూ వర్ధంతి సందర్భంగా నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పరమేశ్వరరావు మాట్లాడుతూ సామాన్య ప్రజలకు స్వాతంత్ర్య ఫలాలు అందాలని నెహ్రూ కృషి చేశారన్నారు. కార్పొరేట్, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మిశ్రమ ఆర్థిక వ్యవస్థ ఏర్పాటుకు పాటుపడ్డారని పేర్కొన్నారు. నెహ్రూ కలలను నిజం చేసేందుకు ప్రస్తుతం రాహుల్ గాంధీ పాటుపడుతున్నారని తెలియజేశారు. కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబటి కృష్ణ, మాసుపత్రి చక్రవర్తి రెడ్డి, గోవింద మల్లిబాబు, కేవీఎల్ఎస్ ఈశ్వరి, దంత త్రినాథరావు, అంబటి దాలినాయుడు, కె.వెంకట్రావు, జి.ప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



శ్రీకాకుళం కల్చరల్: నగరపాలక సంస్థ పరిధిలోని సీపన్నాయుడుపేట గ్రామంలో కొలువైన చెవిటమ్మ ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. అలాగే అమ్మవారి పాదాలకు ముద్రాటలు సమర్పించి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ప్రసాదం అందించారు.

అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు